క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కను నాటి నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పట్టణవాసులు మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మున్సిపల్ అధికారులు బుధవారం పట్టణంలోని ఓశాంతి సర్కిల్, సోమప్ప సర్కిళ్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఏఈ మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణపై అవగాహన

ఆదోని టౌన్: రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ బాబురాజు సూచించారు. ఆయన బుధవారం స్థానిక హెల్త్ సెంటర్‌లో రోగులకు టీబీ లక్షణాలు, నివారణ చర్యలపై వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపుచారలు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉన్నవారు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు బీసీజీ టీకా వేయించాలని, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చెయ్యి అడ్డు పెట్టుకోవాలన్నారు. ఉమ్మి వేసినప్పుడు మట్టిని కప్పాలన్నారు. ఎంపీహెచ్ఎస్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాప్‌లో చోరీ



షాప్ వెనకవైపు రేకును కట్ చేసి చోరీకి పాల్పడిన దొంగలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డులో రెడ్‌చిల్లీ రెస్టారెంట్ పక్కన ఉన్న కూల్‌డ్రింక్ షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రెస్టారెంట్ మూసివేశారు. ఇదే అదునుగా భావించిన దొంగలు కూల్‌డ్రింక్ షాప్ వెనకవైపు రేకును కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం షాప్ తెరిచేందుకు వచ్చిన యజమాని తపాల్ ముఖీమ్ షాప్ వెనక భాగం కట్ చేసి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. షాప్‌లోని రూ.10 వేలు విలువ చేసే కూల్ డ్రింక్స్, సిగరెట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు చెప్పారు.

గడ్డివామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

గోనెగండ్ల: స్థానిక లక్ష్మీపేట కాలనీకి చెందిన గొల్ల సోమన్నకు చెందిన గడ్డివాము నిప్పంటుకుని దగ్ధమైంది. దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయారు. బాధితుడు తెలిపిన వివరాలు.. సోమన్నకు చెందిన ఏడు ఎకరాల పొలంలో పండించిన వేరుశనగ గ్రాసంను కాలనీ సమీపంలో గడ్డివాముగా వేసుకున్నాడు. అయితే బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారని బాధితుడు వాపోయాడు. మంటలు ఎగసి పడటంతో గుర్తించిన స్థానికులు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఇంటి ముందు బాణసంచా కాల్చొద్దన్నందుకు దాడి

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇంటి ముందు బాణాసంచా కాల్చవద్దని చెప్పినందుకు దాడి చేసిన ఘటనపై గ్రామానికి చెందిన ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బోయ సురేష్ తన బామర్ది కృష్ణకుమార్‌తో కలిసి పొలం నుంచి సాయంత్రం బైక్‌పై ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి ముందు బాణాసంచా కాల్చుతున్న బాలమద్ది, శివ, నాగరాజు, మధు, భాస్కర్‌నాయుడులను పక్కకు వెళ్లి కాల్చుకోమని చెప్పాడు. అందుకు నువ్వు ఎవడివిరా అంటూ అతనిపై దాడి చేశారు. ఇతన్ని విడిపించేందుకు ప్రయత్నించిన కృష్ణకుమార్, మహేష్‌లపై కూడా దాడి చేసి గాయపర్చారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతు చిక్కని కారణాలు



ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ప్రజా ప్రభుత్వానికి ఇలాంటి ఫలితాలు రావడం చాలా ఆశ్చర్యానికి గురిచేసింది. ఓటమికి గల కారణాలు అంతుచిక్కడం లేదు. ఎలాంటి అవినీతికి తావులేకుండా గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబానికి పథకాలు అందాయి. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లు అందించారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు బ్యాంకు బలంగా ఉంది. అభిమానులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసినా అవన్నీ ఏమైపోయాయనే సందేహాలు వస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడా బయటపడకపోయినా ఇలాంటి ఫలితాలు రావడం జీర్ణించుకోలేకపోతున్నాం.

– బీఆర్.బసిరెడ్డి, ఎమ్మిగనూరు మండలం

అనుమానంగా ఉంది



వంద శాతం సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీకే ప్రజలు ఓట్లు వేశారు. ఫలితం మాత్రం మరోలా వచ్చింది. ఇంలాటి ఏకపక్ష ఎన్నికల ఫలితాలపై అందరికీ అనుమానంగా ఉంది. లక్షల సంఖ్యలో పింఛన్లు పొందేవారు, అమ్మ ఒడి లబ్ధిదారులు, వైఎస్సార్ చేయూత, కాపునేస్తం వంటి ఎన్నో పథకాలతో పాటు వలంటీర్ వ్యవస్థ, సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలు వైసీపీకి వేసిన ఓట్లు ఏమయ్యాయో తెలియడం లేదు. ఎన్నికల ఫలితాలపై అందరికీ భిన్నాభిప్రాయాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఓడిపోయే అవకాశమే లేదు.

– అస్లాంఖాద్రి, సాంబగల్ గ్రామం, ఆదోని మండలం


ప్రజల్లో అయోమయం



సంక్షేమ పాలన అందించిన జగనన్నకే మేమంతా ఓట్లు వేశాం. అవన్నీ ఎక్కడికి పోయాయి అంటూ ప్రజలందరూ విస్మయానికి గురవుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అందించిన సంక్షేమ పథకాలు మరే నాయకులు ఇవ్వలేరని ప్రతిఒక్కరూ ఆయనకే ఓట్లు వేశారు. తీరా చూస్తే టీడీపీ కూటమి ఏకపక్ష విజయం సాధించినట్లు ఫలితాలు వెలువడ్డాయి. దీంతో మండల ప్రజలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. దొంగదెబ్బ తీశారన్న భావన ప్రతి ఒక్కరిలో కనబడుతుంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్.పురుషోత్తంరెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్, పెద్దకడబూరు

ఫలితాలపై అనుమానాలెన్నో ?



ఆదోని సెంట్రల్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ప్రజలకు అంతుచిక్కడం లేదు. ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చలు సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు ఇప్పటికీ ఫలితాలను జీర్ణించుకోలేకపోతున్నారు. ఏమి జరిగింది, ఎందుకు ఇలాంటి ఫలితాలు వచ్చాయో తెలియక ప్రజలు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారు. అవ్వాతాతలు ఇబ్బందులు పడకుండా ప్రతినెలా ఇంటివద్దకే పింఛన్, అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చేయూత, సున్నావడ్డీ, ఆసరా, చిన్నారుల కోసం అమ్మ ఒడి లాంటి పథకాలు అమలుచేశారు. ఇవిగాకుండా చేనేతలు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, ఆటో కార్మికులు, టైలరింగ్ వృత్తుల వారికి ఆర్థికంగా చేయుతనందించారు. నాడు–నేడు కింద పాఠశాలలు, ఆసుపత్రులు, గ్రామీణ రహదారులను అభివృద్ధి చేశారు. ఇంత మంచి పాలన అందించినా దారుణ ఫలితాలు రావడమేంటని అర్థంగాక పలువురు ఆవేదన చెందుతున్నారు.

కూటమికి ఏమి చూసి పట్టం కట్టారో తెలియని పరిస్థితి

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గట్టెక్కడానికి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను చూసి జనాలు ఓటు వేశారా అనే ప్రశ్నలకు కూడా జవాబు లేదు. కూటమి అధికారంలోకి వస్తే గత ఐదేళ్లుగా జగనన్న అమలుచేసిన పథకాలనే మరింతగా పెంచి ఇస్తామని ప్రకటించారు. కొన్ని హామీలు అమలుచేసేందుకు రాష్ట్ర బడ్జెట్ మొత్తం వెచ్చించినా సరిపోని పరిస్థితి. పెన్షన్‌ను రూ.4 వేలకు పెంపు, రైతలకు ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1500, బస్సులో ఉచిత ప్రయాణం, మెగా డీఎస్సీ, యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి, ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్లు లాంటి పథకాలను ప్రకటించినా ప్రజలు పెద్దగా ఆకర్షితులు కాలేదని పరిశీలకులు చెబుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలుచేసి సువర్ణ పాలన సాగించిన వైఎస్ జగన్ వెంటే జనం ఉన్నారని చెబుతున్నా ఎక్కడ తప్పు జరిగిందో తెలియని పరిస్థితి. ప్రజలు జగనన్న వెంటే ఉంటే ఎన్నికల ఫలితాలు మాత్రం టీడీపీకి 135, జనసేనకు 21, బీజేపీకి 8 సీట్లు వచ్చాయి వైఎస్సార్‌సీపీకి 11 సీట్లు వచ్చాయి. నలభై ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం ఉండి గత ఎన్నికల్లో చావుదెబ్బతిన్న టీడీపీ సంగతి అటుంచితే జనసేన పార్టీ 21 స్థానాల్లో పోటీ చేస్తే అన్ని చోట్ల గెలవడం సాధ్యమా, రాష్ట్రంలో ఏ మాత్రం ప్రభావం లేని బీజేపీ పది చోట్ల పోటీచేస్తే 8 స్థానాల్లో గెలవడం ప్రజల్లో అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇంత ఏకపక్షమైన ఫలితాలు రావడం వెనుక ఏదో కుట్ర ఉంది. దాన్ని బయటపెట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫలితం అనుమానాస్పదం



అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశారు. అయినా ఓట్లు తక్కువగా వచ్చాయి. ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరిగి ఓట్లు వేయించినా ఫలితం అనుమానాస్పదంగా వచ్చింది. మెజారిటీ బాగా తగ్గింది. మాకు ఓట్లు తక్కువ వచ్చాయి ప్రతిపక్ష పార్టీకే ఎక్కువగా వచ్చాయి. ఎలా వచ్చాయో అర్థం కావడం లేదు.

–లింగన్నగౌడ్ నదిచాగి

ప్రజలు ఇచ్చిన తీర్పు కాదు



రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు ఎంతమాత్రం ప్రజా తీర్పు కాదు. ప్రజలు జగన్ వెంటే ఉన్నారు. ఆయనకు ఓట్లు వేశాం కూడా. ఈవీఎం ట్యాపరింగ్ లేక ఇతర కారణాలతో మోసం చేసినట్లు కనపడుతోంది. టీడీపీ కార్యకర్తలు, నాయకులకే అంతుచిక్కని తీర్పు ఇది. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాడు. అలాంటిది ఓటమి ఎలా సాధ్యం?

– బెట్టన గౌడ, కోసిగి

ఈవీఎంలలో ఏమైనా జరిగిందేమో



ప్రతి కార్యకర్త, అభిమాని, రైతులు, మహిళలు ఇలా ప్రజలంతా ఏకమై వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి అనుకున్నంత మెజారిటీ రాలేదు. ఓట్లు వేసిన వారందరూ తెలిపిన అంచనా ప్రకారం మంత్రాలయం నియోజకవర్గంలో 30 వేలకు పైగా మెజారిటీ వస్తుందనుకున్నాం. చాలా తక్కువ మెజారిటీ వచ్చిందంటే పరిస్థితి అర్థం కావడం లేదు. అసలు ఈవీఎంలో ఏమైనా జరిగిందేమో ఎవరికీ అంతు పట్టడం లేదు. – ప్రహ్లాదచారి, కౌతాళం

నిజాలను నిగ్గుతేల్చాలి



దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని చేసి చూపించారు. రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రతి కుటుంబం రూ.5 లక్షల వరకు లబ్ధి పొందింది. ఎన్నికల ఏకపక్ష ఫలితాలను చూస్తే ఏదో జరిగిందనే అనుమానులు ఉన్నాయి. ఎలక్షన్ కమిషన్ కూడా కూటమి నాయకులు చెప్పినట్లుగానే పనిచేసంది. ఫలితాలపై విచారణ జరిపి నిజాలను నిగ్గుతేల్చాలి. – కల్లుబోతుల సురేష్, ఆదోని

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



మాట్లాడుతున్న తాజా మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైందని ఎవరూ అధైర్యపడవద్దని, కార్యకర్తలకు అండగా నిలిచి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తానని తాజా మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి నేతలు రెచ్చగొట్టే ధోరణి అవలంభిస్తున్నారని, పార్టీ కార్యకర్తలెవరూ సంయమనం కోల్పోవద్దని సూచించారు. తమ ఐదేళ్ల పాలనలో ఆదోని పట్టణంలో మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో 10 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. 5 వేల టిడ్కో ఇళ్లు మంజూరు చేశామన్నారు. అభివృద్ధి కూడా లెక్కలేనంతగా చేశాం. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వేలాది మంది బాధితులకు ఆర్థికసాయం అందించాం. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేయడం సంతృప్తినిస్తోందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకొని ఎవరికి ఏ కష్టం వచ్చినా తనదిగా భావిస్తూ సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. కూటమికి చెందిన కొంత మంది నాయకులు కావాలనే రెచ్చగొడుతున్నారని పార్టీ కార్యకర్తలు శాంతియుతంగా ఉండి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజాతీర్పును శిరసావహిస్తామన్నారు. కూటమి కుట్రలు, తప్పుడు ప్రచారం, అధికారులతో కుమ్మక్కు రాజకీయాలు, ఈవీఎంల ట్యాంపరింగ్ వల్ల నష్టపోయామని వాపోయారు. రైతులు, ప్రజలు, ఓటర్లు, మహిళలు, యువత ధైర్యం, ఓర్పు, సహనంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలుచేశారు: మధుసూదన్

గడిచిన ఐదేళ్లల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేశారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో సంక్షేమ సారథిగా పేరు గాంచాడన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీ ఊహించని రీతిలో పరాజయం పాలవ్వడానికి కూటమి చేసిన పన్నాగాలే కారణమన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ చేశారన్న ప్రచారం సాగుతోంది. ఆ దిశగా సరైన ఆధారాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాం అని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి,కౌన్సిలర్ రామలింగేశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ప్రజలకు రుణపడి ఉంటా

ఆదోని అర్బన్: నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపించినందుకు ఆదోని ప్రజలకు రుణపడి ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. ఆయన బుధవారం సాయంత్రం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదోని ప్రజలు 18 వేల మెజార్టీ ఇచ్చి తనను ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇంత మెజార్టీతో గెలుపు అందించిన ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని, ఆదోనిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరైనా కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని, శాంతియుతంగా, కులమతాలకు అతీతంగా పనిచేస్తానని, ఘర్షణలకు పాల్పడేవారు తన వర్గం నుంచి తప్పుకోవాలని సూచించారు. ఆ పార్టీ నాయకులు మల్లప్ప, మురళీ, రాజశేఖర్, నాగరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

వంద టన్నుల వేరుశనగ విత్తనాలు పంపిణీ

కృష్ణగిరి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు వంద టన్నుల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మండలానికి ఈ ఏడాది 1,100 క్వింటాళ్లు కేటాయించినట్లు చెప్పారు. అందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి అయ్యిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు వెయ్యి క్వింటాళ్ల (100 టన్నులు) కాయలు అందజేశామని, మరో వంద క్వింటాళ్లు రావాల్సి ఉందన్నారు. వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. వర్షాలు పడుతుండడంతో పంట సాగు చేసే రైతులు విత్తనశుద్ధి తప్పక చేయాలని సూచించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



హెచ్.మురవణిలో మొక్కను నాటుతున్న దృశ్యం

పెద్దకడబూరు: ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆర్డీప్ స్వచ్ఛంద సంస్థ కార్యకర్త కరుణప్ప అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ ఆధ్వర్యంలో హెచ్.మురవణి గ్రామంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలల ఆవరణలో, ఇళ్ల ముందు దాదాపుగా 100 మొక్కలకు పైగా నాటారు. పొదుపు సంఘాల మహిళలు షేకన్ బీ, మహేశ్వరి, గ్రామస్తులు గోవిందు, శేఖప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



జొహరాపురంలో మొక్కను నాటుతున్న రిసోర్స్‌పర్సన్ ఉసేని, మహిళలు

నందవరం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థ రిసోర్స్ పర్సన్ ఉసేని, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని జొహరాపురంలో పొదుపు మహిళల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషుల మనుగడకు మొక్కలే మూలాధారమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. భవిష్యతు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను అందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలే మానవకోటి ప్రాణాధారమన్నారు. పెరుగుతున్న జనాభాకు స్వచ్ఛమైన గాలి అందించాలన్నా, గ్లోబల్ వార్మింగ్ నుంచి బయటపడాలన్నా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శాలువా, పూలమాలలు వేసి అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గం నుంచి నాల్గవసారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి 12,805 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపేందుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పోటెత్తారు. ఆయనను, ఆయన కుమారుడు వై.ధరణీధర్ రెడ్డిని కలిసి శాలువా, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

కోసిగిలో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ

కోసిగి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున నాల్గవసారి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గెలుపునకు కోసిగి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు విశేషంగా కృషి చేశారు. కోసిగి మండలం నుంచి 3,249 ఓట్ల మెజార్టీ అందించారు. ఇందులో మండల కేంద్రం కోసిగి నుంచి 588 ఓట్ల మెజార్టీ రాగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి 2661 ఓట్ల మెజార్టీ లభించింది. ఇందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సాధించిన గ్రామాల ఓట్లు ఇలా ఉన్నాయి కోసిగి–588 ఓట్లు, కడదొడ్డి–27, కందుకూరు –486, కామన్‌దొడ్డి–43, ఆర్లబండ–170, దుద్ది–101, మూగలదొడ్డి–107, అగసనూరు–125, సాతనూరు–110, ఐరన్‌గల్లు–93, జంపాపురం–239, సజ్జలగుడ్డం–225, చిన్నభూంపల్లి–776, పెద్ద భూంపల్లి –68, పల్లెపాడు–21, చింతకుంట–84, దొడ్డి–301, వందగల్లు–250, గొడుగల్లు–28 ఓట్లు వైఎస్సార్ సీపీకి వచ్చాయి. అలాగే టీడీపీకి మెజార్టీ వచ్చిన గ్రామాలు చిర్తనకల్లు–272, తుంబిగనూరు–52, డి.బెళగల్–38, నేలకోసిగి–43, కొల్మాన్‌పేట–151, జుమ్మలదిన్నె–87 ఓట్లు వచ్చాయి.

➡ నాల్గవసారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి గెలుపొందడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. కోసిగి నుంచి పలువురు కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురం చేరుకుని ఆయన్ను కలిసి శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. అలాగే పార్టీ గెలుపు కోసం కృషి చేసిన మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్‌రెడ్డిని కలిసి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం ఓట్లు వేసి తమ వెంట ఉంటూ గెలుపునకు కృషి చేసి ప్రజలందరికీ, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి అభినందనలు తెలుపుతున్న కోసిగి వాసులు

కౌతాళంలో కుండపోత వర్షం



కౌతాళంలో కురుస్తున్న వాన



వైఎస్సార్‌నగర్‌లో వీధిలో నిలిచిన వర్షపునీరు

కౌతాళం: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది. మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీ, జేకేఎల్ఎస్ నగర్‌లో ఇళ్లలోకి నీరు చేరింది. గంటకు పైగా కురిసిన వానతో కౌతాళం గ్రామం తడిసి ముద్దయ్యింది. ఏ వీధి చూసినా నీటి ప్రవాహం కనిపించింది. గత వారం కురిసిన వర్షంతో కొంతమంది రైతులు పొలాల్లో విత్తనాలను నాటారు. ఇక బుధవారం భారీ వర్షం కురవడంతో మండలంలో విత్తు పనులు మొదలుపెట్టేందుకు అనువుగా మారిందని, భూమిలో తేమ శాతం పెరిగిందని రైతులు చెబుతున్నారు. గురువారం నుంచి విత్తు వేసే పనులను ప్రారంభిస్తామని చెప్పారు. మండలంలో రైతులు ప్రధానంగా పత్తి పంటను సాగు చేస్తారు. ఇందుకోసం ఇప్పటికే విత్తనాలను కొనుగోలు చేసి విత్తు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

వేరుశనగ సాగుకు రైతన్నలు సన్నద్ధం

- మండలంలో 275 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ
- వర్షాల రాకతో దుక్కులకు సిద్ధమవుతున్న రైతన్నలు



పొలాన్ని దుక్కిదున్నుతున్న రైతన్న

గోనెగండ్ల: మండలంలో మెట్ట భూములు ఎక్కువగా ఉండడంతో రైతులు వర్షాధారంపై పంటలు సాగు చేస్తుంటారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, పత్తి పంటలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. రుతు పవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దుక్కులు దున్నేందుకు పూనుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అందించిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు పొందారు. ఈ వర్షాల మూలాన నేల అదునులో విత్తనాలేసేందుకు అవకాశం లభించింది. దీంతో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. మండలంలో వేరుశనగ సాధారణ సాగు 9 వేల హెక్టార్లు ఉంది. ఇప్పటికే మండలానికి 275 క్వింటాళ్ల కే6 రకం విత్తనాలను వ్యవసాయ శాఖ రైతులకు పంపిణీ చేసింది.

సాగులో మెలకువలు

➡ జూన్ నెలాఖారు నుంచి జూలై 15వ తేదీ వరకు విత్తనాలు వేసేందుకు అదునుగా ఉంటుంది.
➡ ఎకరాకు 50 కిలోల విత్తనాలను మాత్రమే వేసుకోవాలి.
➡ సరైన విత్తన మోతాదుతో మొక్కకు–మొక్క మధ్య దూరం ఉంటే మంచి దిగుబడి వస్తుంది.
➡ కిలో వేరుశనగ విత్తనాలకు 4 గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి.
➡ దీంతో మొదలుకుళ్లు, కాండం కుళ్లు, వేరు కుళ్లను అరికట్టవచ్చు.
➡ సాళ్లకు మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెం.మీ దూరం ఉండేలా చూడాలి.
➡ విత్తనం 5 సెం.మీ లోతులో పడేలా చూడాలి లేకుంటే మొలక శాతం తగ్గుతుంది.
➡ ఈ ప్రాంత భూసార పరీక్షల మేరకు ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 50 కిలోల పొటాష్, 50 కిలోల యూరియాను వాడాలి.
➡ విత్తే సమయంలో ఎకరాకు 200 కిలోల జిప్సం వాడాలి. దీంతో వర్షాభావం నుంచి పంటను కాపాడుకోవచ్చు.
➡ విత్తిన 25 రోజులలోపు గొర్రుతో అంతర పనులు చేయాలి. ఆపై ఊడలు దిగుతాయి. అంతర సేద్యం చేయకూడదు.
➡ అంతర పంటలుగా అలసంద, జొన్న, మినుము, అనప, బీన్సు మొదలైనవి సాగుచేసుకోవచ్చు.
➡ పొలం చుట్టూ నాలుగు వరుసలు జొన్న, సజ్జలను వేస్తే వైరస్ తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది.